క్లుప్తంగా

మావుళ్లమ్మవారి ఆలయంలో ఫీడింగ్ రూమ్ ఏర్పాటు



మావుళ్లమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ఫీడింగ్ రూమ్

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ ఆలయంలో మంగళవారం బేబీ ఫీడింగ్ రూమ్(చంటి బిడ్డలకు తల్లులు పాలు ఇచ్చు గది)ని ఉమెన్ చైల్డ్‌వేల్ఫేర్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని వీరవాసరం కాపు సర్వీస్ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పల్లపు వీధి, మద్దాల వారి వీధి, కోమటి చెరువుగట్టు గల ఎలిమెంటరీ స్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, కార్యదర్శి బృందావనం నాగేంద్ర, కోశాధికారి ముఖమట్ల దుర్గాప్రసాద్, వనిత క్లబ్ అధ్యక్షుడు బి లక్ష్మి కల్యాణి, కుంచె వేణు, ఏ అన్నపూర్ణ, ఎం అరుణ, గొర్రె రాధా సులోచన, పంచాయతీ మెంబర్ కుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీచేస్తున్న దృశ్యం.

ఆకివీడు: హిందూ ధర్మాన్ని, వేదాల్ని, సంస్కృతి, సంప్రదాయాల్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని అమలాపురానికి చెందిన పుసులూరి కాంచన శ్రీ వల్లీ మెమోరియల్ ఛారిబుల్ ట్రస్టు ప్రతినిధి అద్దంకి అమరేశ్వరరావు చెప్పారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలోని వేద పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం రాత్రి నిత్యం ఉపయోగపడే 120 పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అమరేశ్వరరావును పాఠశాల ప్రధాన ఆచార్యులు వారణాసి సుబ్రహ్మణ్య శర్మను ఇతర బోధనా సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మన్నే పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



ఉండి: ఇన్‌చార్జ్ తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

ఉండి: అధికారంలోకి వచ్చే ముందు కూటమి ప్రభుత్వం మీడియా ప్రతినిధుల సంక్షేమానికి చేసిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని ఉండి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ పిలుపు మేరకు డిమాండ్స్‌డేను పురస్కరించుకుని ఉండి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ముందుగా నిరసన తెలియజేశారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రత్నకుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాళ్ల ఎంఈఓగా శ్రీనివాసరావు

కాళ్ల: కాళ్ల మండలం ఎంఈఓ-1గా దొమ్మేటి శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. యండగండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన కాళ్ల మండలానికి ఎంఈఓ (ఎఫ్ఏసీ)గా బదిలీపై వచ్చారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది స్వాగతం పలికారు. ప్రస్తుతం కాళ్ల మండలానికి ఆకివీడు ఎంఈఓ రవీంద్ర ఇన్‌చార్జి ఎంఈఓగా ఉన్నారు.

కీటకజనిత వ్యాధులపై అవగాహన

తణుకు అర్బన్: కీటకజనిత వ్యాధులపై క్షేత్రస్థాయి ఉద్యోగులంతా పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వై.నాగబాబు అన్నారు. ఆౕడే సందర్భంగా మంగళవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నిరంతర ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. ముఖ్యంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రామాణికంగా నిర్వహించాలని, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో పారిశుద్ధ్య సమస్యలను పొందుపరచాలని స్పష్టం చేశారు.

ఈ పల్లెలకు వెలుగు లేదా?

- మండలంలో పలు గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు దూరం
- కళాశాల చదువుకు దూరమవుతున్న విద్యార్థులు



పల్లెవెలుగు బస్సు

ఉండి: పల్లె వెలుగు ఆర్టీసి బస్సులు కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతున్నాయి. అవకాశం ఉండి కూడా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం రోజుకు రెండు సార్లు అయినా శివారు గ్రామాలకు ఆర్టీసీ సర్వీసు నడిపితే బాగుంటుందంటూ వేడుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాలకు బస్సు ప్రయాణించేందుకు రహదారి సౌకర్యం ఉన్నా బస్సులు నడిపేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు రాకపోవడంతో పల్లె ప్రజలు ఆర్టీసీకి దూరం అవుతున్నారనే చెప్పాలి. కనీసం ఒకటి రెండు సర్వీసులు నడిపితే ఎంతో మందికి మేలు జరుగుతుందని ప్రజలు ప్రయాణికులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంత గ్రామాల్లో ఉదయం ఒక సర్వీసు, సాయంత్రం ఒక సర్వీసును నడిపిస్తే ఆయా ప్రాంతాల్లో ఉద్యోగులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు, కళాశాలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు చాలా సౌకర్యంగా ఉంటుందని వారంటున్నారు. అలాగే సాయంత్రం బస్సు సర్వీసు నడిపితే ఉదయం వెళ్లిన వారు తిరిగి వచ్చేందుకు కూడా అనువుగా ఉంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో ఇరుకు ఇరుకుగా ఆటోల్లోనే ప్రయాణించాల్సి వస్తుందని విద్యార్థులు, మహిళలు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని భీమవరం నుంచి ఉండి మీదుగా పెదపుల్లేరు, చినపుల్లేరు మీదుగా సీసలి గ్రామాల మీదుగా తిరిగి భీమవరం వెళ్లేందుకు మంచి రహదారి ఉంది. అలాగే భీమవరం నుంచి మహదేవపట్నం, చిలుకూరు, గరగపర్రు మీదుగా తిరిగి భీమవరం లేదా ఇతర ప్రాంతానికి వెళ్లేదుకు రహదారి అనుకూలంగా ఉంది.అలాగే భీమవరం, మహదేవపట్నం, చిలుకూరు, వెలివర్రు మీదుగా ఉండి భీమవరం, అలాగే భీమవరం ఉండి మీదుగా పాములపర్రు, కోలమూరు,ఉప్పులూరు, యండగండి మీదుగా భీమవరం వెళ్లేందుకు మంచి అవకాశం ఉంది. కలిగొట్ల, ఆరేడు, పాందువ్వ, ఉణుదుర్రు, యండగండి మీదుగా భీమవరం మరో సర్వీసు నడిపేందుకు అవకాశం కూడా ఉంది. అంతే కాకుండా గతంలో ఆర్టీసి సౌకర్యం ఉండే భీమవరం ఉండి, చెరుకువాడ, అర్తమూరు దాని శివారు కవిటం పాకల ప్రాంతాలకు సర్వీసును పునరుద్ధరించాలని ప్రాంతం వాసులు కోరుకుంటున్నారు.

పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

ఇతర మండలాల విషయానికి ఆకివీడు మండలంలో ఆకివీడు మినహా మిగిలిన 13 గ్రామాలకు బస్సు వెళ్లే సౌకర్యం వున్నా సర్వీసులు నడిపేందుకు ఆర్టీసి అధికారులు ఆసక్తి చూపడం లేదు. గతంలో చినమిల్లిపాడు, సిద్ధాపురం, చెరుకుమిల్లి తదితర ప్రాంతాలకు ఆర్టీసి బస్సు సర్వీలు ఉండేవి. అయితే వాటిని ఇప్పుడు రద్దు చేశారు. కాళ్ల మండలంలో మాలవానితిప్ప, కలవపూడి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పాలకోడే మండలంలో మైప గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు అంటూ ఊదరగొడుతున్న కూటమి నాయకులు ఇప్పటికైనా స్పందించి శివారు గ్రామాలకు కూడా ఆర్టీసీ సర్వీసులు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చదువులకు దూరం చేయవద్దు



మారుమూల ప్రాంతాల నుంచి చాలా మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో ఉన్న హైస్కూల్స్‌కు వెళుతున్నారు. ఎంత తక్కువ అనుకున్నా కొన్ని ప్రాంతాల్లో సుమారు నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇలాంటి వారి కోసం ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు నడిస్తే ఎంతో మంది చదవుకుంటారు. ముఖ్యంగా కళాశాలలకు వెళ్లే వారు గ్రామాల్లో తగ్గిపోతున్నారు. అధికారులు గమనించాలి.

– గోగులమండ చినకృష్ణమూర్తి, సర్పంచ్, యండగండి

ఆర్టీసీలో ప్రయాణం అంటే నమ్మకం



ఆటోల్లో కిక్కిరిసిన ప్రయాణం చేస్తుంటే చాలా సార్లు ఆటోలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి. అదే ఆర్టీసి బస్సు శివారు గ్రామాలకు ఉదయం, సాయంత్రం రెండు సర్వీసులు నడిస్తే ఆటోల్లో రద్దీ తగ్గుతుంది. అలాగే ఆర్టీసి బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేయవచ్చు.

బందెల ప్రమీల, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు

శివారు ప్రాంతాలకు కూడా సర్వీసులు ఉండాలి



మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి అధికారంలోకి వచ్చి రెండో ఏడాదిలో ఆగస్టు 15న ప్రారంభమవుతుంది అని చంద్రబాబు, కూటమి నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు కేవలం ప్రధాన రహదారుల్లోనే కాకుండా శివారు ప్రాంతాల గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు నడపాలి.

– కొర్రపాటి అనిత, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

వ్యక్తి అదృశ్యం

ఆకివీడు: మండలంలోని చినకాపవరం గ్రామంలోని కాటూరి రవి తేజ చేపల చెరువుపై ఉంటున్న సైదు ప్రతాప్ గత నెల 28వ తేదీ అర్ధరాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని భార్య అవంతి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. కృష్ణా జిల్లా భీమడోలు మండలం చెట్టన్నపాడు గ్రామానికి చెందిన ప్రతాప్ చేపల చెరువుపై కాపలా ఉంటున్నాడన్నారు. బంధువుల ఇళ్ల వద్ద, ఇతర చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

ఆకివీడు: స్థానిక కొత్త బస్ స్టాండ్ వద్ద ఉంటున్న శలా నాగరాజు తనను వేధిస్తున్నాడని ఆ ప్రాంతంలో నివశిస్తున్న గుండిమోగుల చంద్రిక ఫిర్యాదు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జెడ్పీ హైస్కూల్ పరిశీలన

పాలకోడేరు: మండలంలోని మోగల్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఎలక్ట్రానిక్ మెషీన్లు, త్రీడీ ప్రింటర్ యంత్ర పరికరాలను పరిశీలించారు. ఆయన వెంట సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.శ్యాంసుందర్, తహసీల్దార్ విజయలక్ష్మి ఉన్నారు.

చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టిస్తున్న జగన్

పీవీఎల్ నర్సింహరాజు



కుప్పనపూడిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: అధ్వానంగా ఉన్న కూటమి పాలనపై నిప్పులు చెరుగుతూ, చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టించే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారని ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుకోవడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పథకాలు అందుతున్నాయా? అంటూ ప్రశ్నించారు. చాలా మంది మహిళలు పథకాలు రావడం లేదని ముక్తకంఠంతో చెబుతన్నారు. ఉచిత గ్యాస్ పథకం డబ్బులు జమ కావడం లేదని, మహిళలకు, నిరుద్యోగులకు ఇస్తానన్న సొమ్ము నేటికీ వేయలేదని వాపోయారు. ఆక్వాకు కూడా కరెంట్ సబ్సిడీ అందడంలేదని, కరెంట్ బిల్లు దారుణంగా వస్తున్నాయని చెప్పారు. దీనిపై నర్సింహరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ఏడాదిన్నర కావస్తున్నా ప్రజల్ని ఇంకా మోసం చేస్తూనే ఉన్నారన్నారు. పథకాలు వస్తాయని ఎదురు చేస్తూన్న మీ కళ్లు కాయలు కాస్తాయి తప్ప ఒక్క పథకాన్ని చంద్రబాబు అమలు చేయడన్నారు.

జగన్ రోడ్డు ఎక్కితే వణుకు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు ఎక్కితే కూటమి ప్రభుత్వానికి వణుకు పుడుతోందని పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ప్రజా సమస్యలపై , ఇచ్చిన హామీలు అమలుజేయాలని, అన్యాయంగా, అక్రమంగా దాడులు చేసిన వారిని పలకరించేందుకు వెళ్తున్న జగన్‌ను అడ్డుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతోన్నాయన్నారు. ప్రజాభిమానం కట్టలు తెచ్చుకుని వస్తుంటే కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబు, పవన్‌లకు మింగుడుపడటంలేదన్నారు.

పవన్ ప్రశ్నలతత్వం ఎక్కడ?

ప్రశ్నించండి, ప్రశ్నిస్తే తప్పేంటి, ప్రశ్నించడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పిన పవన్ కల్యాణ్ నేడు ప్రశ్నించకుండా ఏమైపోయారని పీవీఎల్ నర్సింహరాజు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోను, సూపర్ సిక్సులపై సంతకాలు చేసిన బాబూ పవన్‌లు వాటి అమలులో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు మెంటే లక్ష్మణరావు, పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, గుండుగొలను ధనరాజు, మాజీ జెడ్పీటీసీ మన్నే పోతరాజు, సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యాం, సర్పంచ్‌లు నందమూరి ప్రకాశం, చిగురుపాటి చిట్టిబాబు, కౌన్సిలర్‌లు దొడ్డి జగదీష్, ఎండీ ఆలీ, కుర్రెళ్ల పొలు, మంతెన సునిల్ కుమార్ వర్మ, చిట్టిబొమ్మ లక్ష్మీనారాయణ, నూకల సత్యనారాయణ, జొన్న చిన్న వెంకటేశ్వరరావు, ముక్కు చంటి, యర్రంశెట్టి ప్రసాద్, నానిన అంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉండిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

ఉండి: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రం ఉండి పలవల రేవులో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు ప్రారంభిస్తారని పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

10న భీమవరంలో ఏబీవీపీ కార్యవర్గ సమావేశాలు

భీమవరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఈనెల 10, 11 తేదీలలో భీమవరం జరగనున్న నేపథ్యంలో సమావేశాల వాల్‌పోస్టర్‌ను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏబీవీపీ ప్రాంత సంఘటన కార్యదర్శి ఎస్ సుమన్ మాట్లాడుతూ ఈ సమావేశాల్లో 250 మందికిపైగా విద్యార్థి నాయకులు పాల్గొంటారన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు వంటి అంశాలపై చర్చించి, తీర్మానాలు చేస్తామన్నారు. తద్వారా భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, నూతన రోడ్ల నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు వంటి అంశాలపై కూడా చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ జ్వాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి స్వాతంత్య్ర దినోత్సవ పక్షోత్సవాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: భారతదేశ స్వాతంత్య్ర ఉద్యమ చరిత్ర ప్రపంచంలోనే గుర్తింపు పొందిందని సమర యోధుల చరిత్ర అజరామమని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)అన్నారు. మంగళవారం క్విట్ ఇండియా స్థూప కమిటీ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ పక్షోత్సవాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పక్షోత్సవ కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 17వ తేదీ క్విట్ ఇండియా దినోత్సవం వరకు వివిధ విద్యాసంస్థల్లో ఈ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 17న విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర

కాళ్ల: మండలంలోని జువ్వలపాలెంలో ఉన్న పైడితల్లి అమ్మవారి 79వ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం విశాఖపట్నం, హైదరాబాదు ప్రాంతాల నుంచి యాత్రికులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో గ్రామమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

అభివృద్ధి పనుల పరిశీలన

భీమవరం: భీమవరం పట్టణం నరసయ్య అగ్రహారంలో సుమారు రూ. 3.7 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు అభివృద్ధి పనులను మంగళవారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు రోడ్డు పనులు జరుగుతున్న వివరాలు మంత్రికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటరాజు, షేక్ మొహద్దీన్, గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



కాళ్ల: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు



ఆకివీడు: విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాళ్ల: విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజా ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ పేదల మెడకు గుదిబండగా మారనున్న స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండా సూరిబాబు, తిరుమని శ్రీను, గండికోట వెంకటేశ్వరరావు, తానుకొండ వెంకటేశ్వరరావు, తులా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: కార్పొరేటర్లకు ఊడిగం చేసే విధంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం అమలుజేస్తుందని సీపీఎం మండల కమిటీ నాయకులు కె.తవిటినాయుడు ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల అదనపు బిల్లులు వస్తున్నాయన్నారు. మీటర్ రీఛార్జి చేయడం ద్వారా తగిన సమయానికి డబ్బులేకపోతే ప్రజలు అంధకారంలో అలమటించాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి రాంబాబు, బీవీ వర్మ, బి.కళ్యాణి, గేదల లావణ్య, బొర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన టెక్నాలజీతో ముందుకు సాగాలి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జగపతిరాజు

భీమవరం: విద్యార్థులు నిత్యం నూతన టెక్నాలజీని అధ్యయనం చేస్తూ పోటీల్లో పాల్గొంటే తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని మరింతగా ముందుకు సాగేందుకు అవకాశాలు ఏర్పడతాయని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు అన్నారు. మంగళవారం కళాశాలలో వేదిక్ విజన్ 2కే 25 పేరిట నిర్వహించే బూట్ క్యాంప్ జావా లైవ్ స్టాక్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు మరింత విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు తమ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ కె వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ నెల 14వ తేది నుంచి రెండురోజులపాటు నిర్వహించే హ్యాక్తాన్ పోటీలకు ప్రారంభ సూచకంగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ వి చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఉండి: వరినాట్లు వేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏడీఏ ప్రతాప్‌జీవన్ తెలిపారు. మంగళవారం ఉణుదుర్రు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రతిరైతూ ఎకరాకు రూ.210 ప్రీమియం చెల్లించి పంట బీమా చేయించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకంలో నగదు పడని రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారా గ్రీవెన్స్ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.నాగలక్ష్మి, రాఘవులు, నాగరాజు, వీఏ భానుప్రకాష్ పాల్గొన్నారు.

లింకు దస్తావేజులు పోయినవి

పాలా సత్యనారాయణ మూర్తి S/o కాశీ విశ్వేశ్వరరావు D.No.22-1-28, పెద పేట, భీమవరం. ప.గో జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా పాలకోడేరు మండలం, కుముదవల్లి గ్రామంలో నా స్థలమునకు సంబంధించి లింకు దస్తావేజు నెం.787/2010 నెంబరు గల ఒరిజినల్ లింక్ దస్తావేజులు 15/7/25 న భీమవరం మా ఇంటి వద్ద నుండి తాలూకా ఆఫీస్ సెంటర్ కు జిరాక్స్ నిమిత్తం వెళ్ళగా మార్గ మధ్యలో పడిపోయినవి దయచేసి దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9666172222

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం

భీమవరం (ప్రకాశంచౌక్): తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం ఆరోగ్యమని సీడీపీఓ లక్ష్మీకాంతం తెలిపారు. మంగళవారం బలుసుమూడి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ద్వారా తల్లికి రొమ్ము క్యాన్సర్ తదితర సమస్యలు రావని తెలిపారు. తల్లిపాలు ఇవ్వటం వల్ల బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తుందన్నారు. ఈ విషయాలన్నీ కళాజాత ప్రోగ్రాం ద్వారా గర్భిణులకు, బాలింతలకు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి అనిల్ కుమారి అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, మహా లక్ష్మి, శ్యామల, రజిని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి అమ్మపాలే శ్రేయస్కరం

ఆకివీడు: తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అమ్మ పాలే వినియోగించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ రత్నకుమారి చెప్పారు. స్థానిక పంచాయతీ వీధిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉండిలో..

ఉండి: తల్లిపాలే పుట్టిన బిడ్డకు మొదటి టీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.మేరీ అన్నారు. మంగళవారం పాములపర్రు గ్రామంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై మేరీ అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లల శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డతో పాటు తల్లికి ఆరోగ్యం లభించడమే కాకుండా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ వి.వాణీ విజయరత్నం అన్నారు. మండలంలోని పల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల గర్భిణీ సమయంలో పెరిగిన అధిక బరువును తగ్గించుకోవచ్చని, బిడ్డకు తల్లిపాలు మెదడు అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.శకుంతల, ఎంపీటీసీ సభ్యురాలు టి.లీలావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.కృష్ణకుమారి, పి.తులసి తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు: తల్లిపాలపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్

90102 23729

90108 51166

Office mail : tpgadvt@gmail.com